# గీతా వశంకరుడు శంకర్

మాడభూషి కృష్ణప్రసాద్

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ముందుమాట | 5 |
| 2. | ప్రస్తావన | 6 |
| 3. | కన్నులవిందు చేసే కేరళ సొగసులు | 9 |
| 4. | శంకర్ బాల్యచేష్టలు | 10 |
| 5. | కళాశాల చదువు | 24 |
| 6. | ప్రేమోపాసకుడు | 29 |
| 7. | వివాహబంధం | 35 |
| 8. | కార్టూనిస్ట్‌గా ఆవిర్భావం | 37 |
| 9. | హిందుస్థాన్ టైమ్స్ | 41 |
| 10. | లండన్ ప్రయాణం | 50 |
| 11. | తిరిగి భారతదేశానికి రాక | 56 |
| 12. | శంకర్స్ వీక్లీ అంకురార్పణ | 61 |
| 13. | శంకర్స్ వీక్లీ ఆవిర్భావం | 66 |
| 14. | చిన్నారుల చెలికాడు | 78 |
| 15. | చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్ | 84 |
| 16. | బాలల పుస్తక రచయిత | 87 |
| 17. | సన్మానాలు, సత్కారాలు | 92 |

**అనుబంధాలు**

| | | |
|---|---|---|
| 1. | కార్టూనిస్ట్‌ల పితామహుడు డేవిడ్ లో (రాజకీయ కార్టూన్‌లు) | 94 |
| 2. | శంకర్ కార్టూన్లు – స్థూల పరిచయం | 103 |

# కన్నులవిందు చేసే కేరళ సొగసులు

కేశవ శంకర పిళ్ళై 1902 జూలై 31న కేరళలోని కాయంకులంలో జన్మించాడు. ఆయన చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నాడు. తల్లి తిరిగి పెళ్లి చేసుకొని తన దారిన తాను వెళ్లిపోయింది. అతనిని మేనమామ తండ్రి, మేనమామ, అమ్మమ్మ పెంచి పెద్దచేశారు. మనం పైన చెప్పుకున్నట్లు తాత చండశాసనుడైనా, అమ్మమ్మ అతనిపై అవ్యాజమైనప్రేమ కురిపించేది. ఆమె ప్రేమలో ఆయన ఒక తల్లి అమృతమయమైన ఆప్యాయతను, అనురాగాన్ని చవిచూశాడు. అందుచేతనే ఆయన తనకు తల్లిదండ్రుల ప్రేమ కరువైందని ఎన్నడూ కలతచెందలేదు. తాత సూర్యుడైతే ఆమె చంద్రుడు. ఇద్దరూ ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దారు. ఆయనపై ఆమె ప్రభావమే ఎక్కువ.

ఆయన పుట్టిన కేరళ ప్రకృతి అందాలకు, నందనవనాల్లాంటి పూలతోటలకు ప్రసిద్ధి. పచ్చ పచ్చని చేలతో, భూమికి ఆకుపచ్చని రంగు అద్దినట్లు అలరారే చెట్లతో వింతసోయగాలు అద్దుకొని యాత్రికులను ఎల్లవేళలా ఆహ్వానిస్తూ ఉంటుంది కేరళ. గలగల పారే సెలయేళ్లు, బిరబిరా పరుగిడే నదులు, చక్కనిచుక్కల చిక్కిన నడుములా ఉండే సన్నని కాలువలు, పిల్లగాలులతో చూపరులను ఆహ్లాదపరచే చెరువులు – ఎంత అందమైన దృశ్యమాలిక? ఇవేకాదు, దేవతలే దివినుండి భువికి దిగివచ్చి కట్టారా అనిపించే దేవాలయాలు, నాటి రాచరికపు తీపిగుర్తులుగా నిలిచే అంతఃపురాలు – కన్నుల విందుచేసే కేరళ సరళాంతరంగ. ఇప్పుడే కొబ్బరిచెట్లతో శోభిల్లుతున్న భూమి ఒక శతాబ్దం కిందట మరెంత సొబగుగా ఉండేదో ఊహించుకుంటే చాలు శరీరం పులకరించిపోతుంది. ఊహాలోకపు ఊరించే అందాలన్నీ కేరళ సొంతం. అందుకే కాబోలు దీనిని ‘God’s own country’ (దేవుని స్వంత దేశం) అని పిలుస్తారు.

# శంకర్ బాల్యచేష్టలు

శంకర్ చిన్ననాటి నుండి ప్రకృతి ప్రేమికుడు. విరబూసిన ప్రతిపువ్వు, ఎగురుతున్న ప్రతి సీతాకోకచిలుక, పువ్వుమీద వాలే ప్రతి తేనెటీగ ఆ చిన్నారిని ఆకట్టుకునేవి. ప్రకృతి ఒడిలో పెరిగితేనే కదా కళాకారుడికి ధన్యత, మాన్యతలు చేకూరేది. కవినైనా, చిత్రకారుడినైనా, నాట్యకారిణినైనా మలచే శిల్పి ప్రకృతి. ప్రకృతి ఒడిలో పెరిగితేనే కదా వ్యక్తి పరిపూర్ణతకు చేరువయ్యేది. ప్రకృతి ఒడిలో పెరగకపోతే మానవ ప్రకృతి వికలం అవుతుంది. అప్పుడే మానవ సమాజం చూడలేనంత వికృతరూపం దాలుస్తుంది. అనేక అపశ్రుతులు చోటుచేసుకుంటాయి. అవే కదా ఈనాటి సమాజంలో మనం అడుగడుగునా చూస్తున్నాం.

శంకర్ బాల్యం – కట్టడులు, కఠిన క్రమశిక్షణ మధ్య కూడా హాయిగా, ఆనందంగా గడిచింది. తనను పెంచి పెద్దచేస్తున్న వాళ్లకు ఒదిగి ఉంటూనే అల్లరిచేసే స్వాతంత్ర్యాన్ని వాళ్లకు తెలియకుండా కైవసం చేసుకున్నాడు. శంకర్ అల్లరి చేసినా అది ఎవరికీ హానిచేయని, అపకారంచేయని అల్లరి. అతను జంతువులకు కూడా ఏ విధమైన హానీ తలపెట్టేవాడు కాదు. వాటిపై అతనికి ఎనలేని ప్రేమ.

చెంగున నీటిలో ఎగిరే చేపలే కాదు. చెంగు చెంగున ఎగిరే జాతివన్నె బుజ్జాయిలన్నా, నోరులేని తువ్వాయిలన్నా ఆయనకు ఇష్టమే. చిన్నతనంలో ఆవుల కొట్టంలోనే ఎక్కువకాలం ఉండేవాడు. గంతులువేస్తూ అమాయకంగా అందంగా ఉండే దూడలు అతనిలో మరింత ఆనందాన్ని నింపేవి. అతను పల్లె పట్టుల్ని విడిచిపెట్టినా, తన మనసును ఆ పల్లెపట్టులు విడిచిపెట్టలేదు. అందుకనేమో ఆయన జీవితాంతం స్ఫటిక స్వచ్ఛంగా జీవించాడు. జీవితంలో అసలైన ఆనందం ఆస్వాదించాలంటే మాలిన్యం లేని పసితనం మనసులో ఉండాలి.

తాత అంటే ఒకవైపున భయం ఉన్నా, ఏదో ఒక చిలిపిపనో, మరొక సాహసమో చేయాలన్న తపన అంతరాంతరాల్లోంచి తన్నుకు వచ్చేది. ఆ తపన అతనిని ఒకచోట కుదురుగా కూర్చోనిచ్చేదికాదు. 'ఏ తావున నిలకడరా నీకు' అని త్యాగయ్య అనలేదూ!